# హింస

-కొండేపూడి నిర్మల

"...అయితే కొట్టాడంటావు"

'అవునండి'

"నీ మొగుడేనా!?"

'అవునయ్యా'

"నువ్వు వాడి పెళ్ళానివేగా..."

ఔ... అనబోతూ అనుమానంగా చూసింది గౌరీలక్ష్మి.

"వాడు నీ మొగుడేనా..." మళ్ళీ రెట్టించాడు పోలీసాఫీసరు

ఔనన్నట్టు తలూపింది

"అగ్నిసాక్షిగానా..." కావాలనే ఈ మాట అడిగాడు.

'పెద్దలు చేసింది కాదండి' అగ్నిదేవుడ్ని సాక్ష్యం తేలేనందుకు వినమ్రంగా చెప్పింది.

" ఓహో... ఆ బాపతా..." ఎగాదిగా చూశాడు పోలీసాఫీసరు.

కష్టాలన్నీ ఏకరవు పెట్టాలని కొట్టిన దెబ్బలన్నీ చూపించాలని వచ్చిన సావిత్రి ఇబ్బందిగా కొంగు కప్పుకుని మాట కూడదీసుకుంది.

'నాలుగేళ్ళ నుంచీ కలిసే వుంటున్నామండి. తాళి కూడా కట్టాడు...'

' ఇప్పుడు విప్పేస్తాననంటాడా ఏమిటమ్మా నీ సమస్య'

ఎలా దడిపిస్తానో చూడు అన్నట్టు కళ్ళెగరేసి పక్కనున్న పోలీసు వంక చూశాడు ఆఫీసరు. సావిత్రికి తను వచ్చిన వనేమిటో మర్చిపోతానేమోనని కంగారు పట్టుకుంది.

'కొడుతున్నాడండి' అంది ఎలాగోలా

"మొగుడు కొట్టక యింకెవడు కొడతాడమ్మా పెళ్ళాన్ని! పోనీ నేను కొడితే ఊరుకుంటావా" అన్నాడు. నాటకీయంగా గొంతుమార్చి

పక్కనున్న పోలీసు ఫెళ్ళున నవ్వాడు.

కొట్టడం అనే పదాన్నంతసేపు నొక్కి నొక్కి వ్యాఖ్యానించడంతో తలబొప్పికట్టినట్టయింది గౌరీలక్ష్మికి.

" ఇంతేనా యింకేమైనా వుందా?" అడిగాడు పోలీసాఫీసరు.

గౌరీలక్ష్మికి నోరు పెగల్లేదు. కాళ్ళు చేతులూ చలనం లేనట్లుగా అయ్యాయి. పావుగంట సేపలా కూచుని వాళ్ళ చూపులు భరించలేక బస్సెక్కింది.

* * *

"... ఇంత హింస భరిస్తున్నావా" అన్నాడు అడ్వకేటు అంతా విని.

గౌరీలక్ష్మి కళ్ళు మెరిశాయి. అప్రయత్నంగా చేతులు జోడించి అంది " ఔను సార్, పోలీస్‌స్టేషన్లో రిపోర్టిచ్చినా వాళ్ళు పట్టించుకోవడంలేదు"

"ఔనూ ఎందుకింత హింస పెడుతున్నాడు. కారణం ఎప్పుడైనా అడిగావా" ప్రశ్నించాడు. ఆలోచనలో పడింది గౌరీలక్ష్మి.

"ఎందుకో నీక్కూడా తెలీదా. యిదెక్కడి విడ్డూరం? పోనీ ఏమని తిడతాడో చెప్పు. మనం ఫిర్యాది నోటీసు తయారు చేసుకోవాలి కదా"

'దరిద్రపు గొట్టు మొహమా అంటాడండీ'

" ఓహో కట్నం తేలేదనా... యింకా"

"నువ్వు చస్తే పీడా వదుల్తుందంటాడండీ'

" ఓహో ద్వితీయ వివాహపు తలంపా"

"నే వచ్చేదాకా ఎవరితో కులుకుతున్నావే అంటాడండీ'

'సరే, అనుమానం కూడా వుందన్నమాట. అది మామూలేలే.'

గౌరీలక్ష్మి మాటాడ్డం ఆపేసింది.

'సరే నువ్వలా పక్కన కూచో నీ భర్తతో కూడా మాట్లాడతాను'

బెంచీ మీద చతికిలబడింది గౌరీలక్ష్మి.

"ఏమయ్యా నానా హింసలు పెడుతున్నావని నీ భార్య అంటోంది ఏమిటి సంగతి?"

'అంతా అబద్ధమండి'

''అబద్ధమా? దెబ్బలు కూడా వున్నాయి కదయ్యా వొంటిమీద...''

'అవి నేను కొట్టినవి కాదండీ! ఆ ముండ అందరితోనూ జగడాలకి దిగుతుంది. నిన్న పంపు దగ్గర దొమ్మీ జరిగింది. మెత్తగా దీన్ని తన్ని వూరుకుంది అప్పాయమ్మ.'

"అప్పుడు నువ్వేమన్నావు?"

'నేనెందుకు వూరుకుంటాను. నాలుగు తగిలించాను. మనశ్శాంతి లేకుండా పోతోంది దీని మూలంగా...'

" ఏమిటమ్మా అతని ఆరోపణకి నీ జవాబేమిటి'' గౌరీలక్ష్మి వంక ధీమాగా చూసి అడిగాడు అడ్వకేటు.

'ఈయన అస్తమానూ తాగికొడుతున్నాడండీ. తాగి వొళ్ళు తెలవనోడు నిన్నేం సుఖపెడతాడని అప్పాయమ్మ మొగుడు మొన్న సాయంత్రం అందరి ముందూ పంపుకాడ నా చెయ్యట్టుకున్నాడండి. అంతమంది ఆడాళ్ళుండగా నీ చెయ్యే ఎందుకట్టుకున్నాడే నా మొగుడూ, నువ్వేలాంటి ఆడదానివే అంటూ అప్పాయమ్మ బురదలోకి తోసి మరీ కొట్టిందండీ. బురదలో పడిపోయి ఏడుస్తున్న నన్ను పరువు పోగొట్టావని వీడు మళ్ళీ కొట్టాడండి.' అడ్వకేటుకి బుర్ర గిర్రున తిరిగింది.

ఇష్షూ... అంటూ బల్లమీద పిడికిలితో గుద్ది "వచ్చే మంగళవారానికి మళ్ళీ రామ్మా ఇప్పుడు నాక్కొంచెం పనుంది" అన్నాడు.

***

'నీకేం ఫర్లేదు ఉన్నదున్నట్టు చెప్పు. నీలాంటి వాళ్ళ కోసమే మేమొక కొత్త శీర్షిక ప్లాన్ చేశాం.' చల్లటి ఏ.సి. గదిలో తెల్లటి చొక్కా వేసుకున్న పావురం లాంటి ఎడిటరు హామీ ఇచ్చి కదిలాడు.

గాయాలన్నీ మళ్ళీ ప్రవహింపచేసినట్టు వినిపించింది గౌరీలక్ష్మి.



చకచకా రాసుకున్నాడు ట్రెయినీ రిపోర్టరు.

అన్ని భంగిమల్లోనూ ఫొటోలు తీశాడు ఫొటోగ్రాఫరు.

కష్టాలన్నీ కొండెక్కిపోయినంత నిశ్చింతగా ఆ గదిలోంచి యివతలికి వస్తూ గుమ్మంలో ఎదురైన శాల్తీని చూసి ఉలిక్కిపడింది.

ఓరి వీడి మొహం తగలెయ్యా వీడెందుకొచ్చాడో ఏ మొహంతో వచ్చాడో. రానీ



ఆళ్ళే గడ్డిపెట్టి పంపుతారు. వీడి బాగోతం రేపు పేపర్లో వచ్చాక ఊస్తారు మొహమ్మీద అనుకుని పళ్ళు నూరుకుంది.

***

మొన్నటివారం ముచ్చటదేం వుందిలే గాని యిది చూడు యింకా అదిరింది. రాజ్యలక్ష్మి చెప్పేదాకా తెలవలేదు గౌరికి.

ఆత్రంగా పుస్తకం పేజీలు తిరగేసి చూసింది.

గౌరీలక్ష్మి కథనం నిజం కాదా? హెడ్డింగు కింద పరమ దయనీయంగా ఏడుస్తున్న మొగుడి ఫొటో.

నాలుగు వరకూ చదివి మానేసిన గౌరీ అక్షరాలు కూడబలుక్కుంటూ చదివింది.

గౌరీలక్ష్మి అనబడు ఈ పాతికేళ్ళ యువతి అమాయకుడైన భర్తను మోసంచేసి అనేకమందితో అక్రమ సంబంధాలు సాగించేదని, అవి బయటపడేసరికల్లా పోలీసుల్ని, కోర్టును, చివరకు పత్రికల వారిని కూడా వుభ్యపెట్టడానికి చూసిందని ఆమె భర్త స్వయంగా చెబుతున్నాడు...

తరువాత యింక చదవాలనిపించలేదు. అక్షరాలు అలుక్కుపోయినట్టు కనిపించింది. గబగబా గూట్లో వున్న కిందటివారం పత్రిక పేజీలు తీసి చూసింది. తన పట్ల ఎంతో సానుభూతి చూపిస్తూ రాసిన వ్యాసం దీనికి దీటుగా వుంది.

రెండు వారాల పాటు నిష్పాక్షికంగా అచ్చయిన కథనాలు రెండూ గౌరీలక్ష్మి జీవితాన్ని సుడిగుండంలోకి నెట్టేశాయి. గుమ్మం దాటి బైటికెళ్ళాలంటే భయం. పన్లోకెళ్ళాలంటే భయం. బ్రతకడానికి భయం. చావడానికి భయం.

పగలంతా తప్పతాగి కొంపకి చేరిన ఆమె మొగుడు గొడ్డును బాదినట్టు బాదుతూనే వున్నాడు. హింస విజృంభించినప్పుడల్లా అతని మొహంలో ఒక పోలీసాఫీసరు, ఒక అద్వకేటు, ఒక ఎడిటరు కిటకిటలాడుతూ కనిపించడం మొదలెట్టారు.

*